
వాకింగ్ ట్రాక్


గ్రీనరీ


పరగోలాస్


చిల్డ్రన్స్ ప్లే ఏరియా


ఓపెన్ థియేటర్ గోడలకు వేసిన రంగురంగుల చిత్రాలు

‘చిల్డ్రన్స్ థీమ్ పార్కు’

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లిలోని భెల్ ఎంఐజీ కాలనీలో ‘చిల్డ్రన్స్ థీమ్ పార్కు’అందుబాటులోకి వచ్చింది. ఈ పార్కును 5.3 ఎకరాల్లో నిర్మించారు. ఎంఐజీ కాలనీలోని వాణి విద్యాలయం సమీపంలో ఉన్న పార్కులో ఓపెన్ జిమ్, వాకింగ్ ట్రాక్, సైకిల్ ట్రాక్ ఏర్పాటు చేశారు.యోగా ఫ్లాట్‌ఫారమ్, బర్త్‌డే, సాంస్కృతిక కార్యక్రమాలు, ఇతర కార్యక్రమాలను నిర్వహించుకునేలా ఆంఫీ థియేటర్‌ను అందంగా తీర్చిదిద్దారు. పార్కు చుట్టూ గోడలకు వేసిన పక్షులు, చేపలు, చోటా భీమ్ బొమ్మలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.


ఓపెన్ జిమ్




భెల్ ఎంఐజీ కాలనీలోని చిల్డ్రన్స్ థీమ్ పార్కు


ముగ్గుల పోటీలు

విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

హఫీజ్‌పేట్ : సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్, కొమిరిశెట్టి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో హఫీజ్‌పేట్, మియాపూర్ డివిజన్ల పరిధిలోని ఇంజనీర్స్ ఎన్‌క్లేవ్ 2, నీలిమ హైట్స్‌లలో ముత్యాల ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ హాజరై మాట్లాడుతూ ప్రతి కాలనీకి ప్రథమ, ద్వితీయ, తృతీయ, 5 కన్సోలేషన్ ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్నామన్నారు. అపార్ట్‌మెంట్ కల్చర్ పెరిగిన తరువాత మన ప్రాచీన సంస్కృతి సంప్రదాయాలు భవిష్యత్తు తరానికి అందించడానికి పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు శ్రీనివాస్ యాదవ్, సీతారాం స్థానిక మహిళా నాయకురాలు దుర్గ, మౌనిక, అనూష, మాధవి పాల్గొన్నారు.

9న ‘మనూ’లో ప్రత్యేక ఉపన్యాసం

రాయదుర్గం: మనూ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 9వ తేదీ ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయం క్యాంపస్‌లోని డీడీఈ ఆడిటోరియంలో ఉదయం 10.30 గంటలకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డబ్ల్యూఆర్ఐ ఇండియా సీనియర్ ఫెలో అమితాబ్ కుందు ‘ఇండియా టువర్డ్స్ ఇన్‌క్లూజివ్ అండ్ సస్టైయినబుల్ డెవలప్‌మెంట్ అవకాశాలు, చాలెంజెస్’ అనే అంశంపై ప్రత్యేక ఉపన్యాసం ఇస్తారు.

త్వరితగతిన చెరువు పనులను పూర్తి చేయాలి

● ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

మియాపూర్ : త్వరితగతిన రేగులకుంట చెరువు పనులను పూర్తి చేయాలని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. ఆదివారం చందానగర్ డివిజన్ పరిధిలోని దీప్తీశ్రీనగర్ కాలనీలో గల రేగులకుంట చెరువు సుందరీకరణలో భాగంగా సేల్స్‌ఫోర్స్ ఐటీ కంపెనీ సౌజన్యంతో సీఎస్ఆర్ ఫండ్స్ ద్వారా రూ.1కోటి 50లక్షల అంచనా వ్యయంతో చేపడుతున్న చెరువు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే గాంధీ నాయకులు, అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచినీటి చెరువుగా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ చందానగర్ డివిజన్ అధ్యక్షుడు రఘునాథ్‌రెడ్డి, వివేకానందనగర్ డివిజన్ అధ్యక్షులు సంజీవరెడ్డి, నాయకులు వెంకటేష్,ప్రసాద్, సీతారామయ్య, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న జాతరలో ఎమ్మెల్యే


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ఆలయ నిర్వాహకులు

పటాన్‌చెరు టౌన్: డివిజన్ పరిధిలోని ఆలివ్స్ కాలనీలో ప్రారంభమైన బండల మల్లన్న జాతర మహోత్సవంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ఆదివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.... భక్తుల సౌకర్యార్థం అన్ని రకాల ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. భవిష్యత్తులో ఆలయాన్ని మరింత అభివృద్ధి పరచనున్నట్లు తెలిపారు. అనంతరం శ్రీరామ్ నగర్ కాలనీలోని దుర్గామాత దేవాలయాన్ని దర్శించుకున్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి గూడెం యాదమ్మ మహిపాల్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, కార్పొరేటర్లు మెట్టు కుమార్ యాదవ్, పుష్ప నగేష్, గూడెం మధుసూదన్ రెడ్డి, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు అఫ్జల్, గోపాల్, చంద్రశేఖర్, ఆలయ కమిటీ అధ్యక్షులు మల్లేష్ యాదవ్ , తదితరులు పాల్గొన్నారు.

మెట్రోరైల్‌ను ఇస్నాపూర్ వరకు విస్తరించాలి

మెట్రోరైల్ సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షులు సత్యనారాయణ


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ

పటాన్‌చెరు టౌన్: మెట్రోరైల్‌ను ఇస్నాపూర్ వరకు విస్తరించాలని మెట్రోరైల్ సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలో ఏర్పాటు చేసిన సాధన సమితి విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మెట్రోరైల్‌ను మియాపూర్ నుండి పటాన్‌చెరు వరకు పొడిగింపు నిర్ణయంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అయితే మెట్రో సాధన సమితి ప్రధాన డిమాండ్ సంగారెడ్డి వరకు విస్తరించాలని డిమాండ్ చేశారు. ఇదే అంశంపై త్వరలో ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రులను కలవాలని ఈ సమావేశంలో నిర్ణయించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో రుద్రారం శంకర్, ఈర్ల రాజు, మెట్టుశ్రీధర్, రమేష్ పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీతోనే సమస్య పరిష్కారం


మాట్లాడుతున్న ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షులు నర్సింహారెడ్డి

పటాన్‌చెరు టౌన్: కార్మికుల సమస్యల పరిష్కారం ఐఎన్‌టీయూసీతోనే సాధ్యమని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షులు నర్సింహారెడ్డి అన్నారు.ఆదివారం ఏషియన్ పెయింట్స్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ సర్వసభ్య సమావేశంలో అయన మాట్లాడుతూ...ఏషియన్ పెయింట్స్ పరిశ్రమలో కార్మిక హక్కులను సాధించిన ఘనత అఖిలభారత ఐఎన్‌టీయూసీ అధ్యక్షులు డాక్టర్ సంజీవరెడ్డిదే అని గుర్తు చేశారు .వచ్చే గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో కార్మికులు ఐఎన్‌టీయూసీని గెలిపించినట్లయితే కార్మికుల పెండింగ్ సమస్యలు సాధిస్తామన్నారు. ఈ సమావేశంలో మాజీ కార్మిక సంఘం అధ్యక్షుడు శుక్ల, ఉపాధ్యక్షులు చంద్రమౌళి, కరుణాకర్‌రెడ్డి, లక్ష్మణరావు, సూర్యకాంత్, జీఎస్ రెడ్డి, శ్రీనివాస్ ,సోమిరెడ్డి, సింగ్ సుబ్రహ్మణ్యం, వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూ ఆర్టీసీ డిపోలో వనభోజనాలు


మాట్లాడుతున్న డిప్యూటీ రీజనల్ మేనేజర్ కవిత

రాయదుర్గం: ఆర్టీసీ ఉద్యోగుల్లో ఐక్యత, స్నేహభావం పెంపొందించడానికే వనభోజనాలు ఏర్పాటు చేయడం జరుగుతోందని ఆర్టీసీ కూకట్‌పల్లి డివిజన్ డిప్యూటీ రీజనల్ మేనేజర్ ఆర్ కవిత పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ ఆర్టీసీ డిపోలో ఆదివారం వన భోజనాలను డిపో మేనేజర్ ఎంఎంరెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ విధి నిర్వహణలో బిజీగా ఉండే ఉద్యోగుల్లో ఉల్లాసాన్ని నింపేందుకు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ప్రతి డిపోలో ఆదాయం పెంపు, వ్యయం తగ్గించడంపై దృష్టి పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌సీయూ డిపో అసిస్టెంట్ మేనేజర్ ట్రాఫిక్ ప్రశాంత్, ఎంఎఫ్ రహమాన్, ఉద్యోగులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల పాత్ర కీలకం



మియాపూర్ : నేరాలను అదుపు చేయడంలో సీసీ కెమెరాల పాత్ర కీలకమని ఎస్ఐ రాజు అన్నారు. ఆదివారం మియాపూర్‌లోని ఎస్ఆర్ ఎస్టేట్స్ గేటెడ్ అపార్ట్‌మెంట్‌లో 116 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ కెమెరాలను ఎస్ఐ ప్రారంభించారు.

కమ్యూనిటీహాల్‌కు నిధులు మంజూరు చేయిస్తా



రాయదుర్గం సగర సంఘం కేలండర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే గాంధీ, సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శేఖర్‌సగర తదితరులు

రాయదుర్గం: శేరిలింగంపల్లిలోని సగరుల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తామని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ స్పష్టం చేశారు. రాయదుర్గంలోని సగర సంఘం నూతన ఆంగ్ల సంవత్సర కేలండర్‌ను సగర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పరి శేఖర్ సగరతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాయదుర్గంలో సగర సంఘం కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం రూ.10 లక్షలను మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో సగర సంఘం నాయకులు రవి, విష్ణు, వెంకటరాములు, ఉప్పరి మహేందర్, ఎర్రంశెట్టి సీతారామ్, పద్మ, కురుమూర్తి, వేముల రవి,సభ్యులు పాల్గొన్నారు.

రోడ్లపై వాహనాలు.. ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు

● ఇబ్బందులుపడుతున్న వాహనదారులు, పాదచారులు
● కుచించుకుపోతున్న రహదారులు
● నిత్యం ట్రాఫిక్ సమస్య


జేపీఎన్ నగర్ రోడ్డుపై నిలిపిన వాహనాలు

మియాపూర్: ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు, రోడ్లపై వాహనాల పార్కింగ్‌తో రోడ్లు కుచించుకుపోయి ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. ప్రధానరోడ్లలో సైతం ఫుట్‌పాత్‌లు ఆక్రమణలతో పాదచారులు నడవడానికి వీలు లేకుండా ఉంది. వ్యాపార సముదాయాలకు పార్కింగ్ సౌకర్యం లేకపోవడంతో వాహనాలను రోడ్డు పక్కనే పార్కింగ్ చేస్తుండడంతో సమస్య ఏర్పడుతోంది.

◆ మియాపూర్‌లోని జేపీఎన్‌నగర్ ప్రధానరోడ్డులో ట్రాఫిక్ సమస్య నెలకొంది. ఈ రోడ్డు వెంబడి మదీనాగూడ, మక్తమహబూబ్‌పేట్, దీప్తీ శ్రీనగర్, అమీన్‌పూర్, బొల్లారం, బాచుపల్లిలకు వెళ్తుంటారు. నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి.

◆ ఈ రోడ్డు వెంబడి ఫుట్‌పాత్‌లపై, రోడ్డుపై వ్యాపారాలు చేస్తున్నారు. రోడ్ల పైనే వాహనాల పార్కిం, ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు ఉండడంతో పాదచారులు నడవడానికి ఇబ్బందులు పడుతున్నారు.

◆ 80 ఫీట్ల రోడ్డు సగానికి పైగా ఆక్రమణకు గురి కావడంతోబాటు వారంలో రెండు రోజులు సంత కూడా నిర్వహిస్తున్నారు.

◆ జీహెచ్ఎంసీ,ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది పట్టించుకోకపోవడంతో సమస్య వస్తోందని వాహనదారులు, స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సమస్య పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.






భరతనాట్య ప్రదర్శన

మాదాపూర్: శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాలలో భాగంగా ఆదివారం సుభద్ర నృత్య విహార్, స్కూల్ ఆఫ్ ఆర్ట్స్‌కు చెందిన కళాకారులు భరతనాట్య ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. ఇందులో పుష్పాంజలి, అలరిపు, జతిస్వరం, దేవిస్తుతి, వరవీణ, దశావతార తదితర అంశాలను విదూషి సుబ్రత, యోగిత, తేజ, యశస్విని, ఖుషి, లిపి, ద్యుతి, సాక్షి, విస్మిత ప్రదర్శించారు.

ప్రవేశ పరీక్ష దరఖాస్తు గడువు పెంపు

రాయదుర్గం: సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా 5వ తరగతి ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవడానికి గడువు పెంచినట్టు గౌలిదొడ్డి సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల/కళాశాల ప్రిన్సిపల్ శారద తెలిపారు. ఈనెల 20వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. రూ.100 రుసుము చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. ఫిబ్రవరి 11న ప్రవేశ పరీక్ష జరుగుతుందన్నారు.

ఫస్ట్ ఫ్యాషన్ కేలండర్ -2024



గచ్చిబౌలి: ఫస్ట్ ఫ్యాషన్ కేలండర్ 2024ను పలువురు నటీనటులు ప్రారంభించారు. గచ్చిబౌలిలోని ఐ బొటిక్ , స్టూడియోలుక్స్ ఆధ్వర్యంలో కేలండర్‌ను ఆవిష్కరించి సినీ తారలు సందడి చేశారు. సినీ నటులు నవీన్‌చంద్ర, వెంకట్, చైతన్య రావు ,కృష్ణుడు, కామాక్షి భాస్కర్ల, ప్రణీత పట్నాయక్, అశ్విన్ తదితరులు ఉన్నారు. కొత్త కాన్సెప్ట్‌తో కేలండర్‌ను షూట్ చేశామని ఐ బొటిక్ నిర్వాహకులు డాక్టర్ జగదీశ్‌రెడ్డి, డాక్టర్ ప్రణతిరెడ్డి పేర్కొన్నారు.

వినికిడి యంత్రం అందజేత



గచ్చిబౌలి: అవయవ లోపంతో బాధపడుతున్న వ్యక్తికి సందయ్య మెమోరియల్ ట్రస్ట్ చేయూతనిచ్చింది. మియాపూర్ డివిజన్‌కు చెందిన మనోజ్ చిన్న వయస్సు నుండే వినికిడి లేమితో బాధపడుతున్నారు. ట్రస్ట్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే భిక్షపతి యాదవ్ బాధితుడికి రూ.50 వేల విలువ చేసే అత్యాధునిక వినికిడి యంత్రాన్ని అందించారు.

వెస్ట్ జోనల్ కమిషనర్‌గా స్నేహ శబరీష్ బాధ్యతల స్వీకరణ



గచ్చిబౌలి: శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ కమిషనర్ స్నేహ శబరీష్ (ఐఏఎస్) బాధ్యతలు స్వీకరించారు. వెస్ట్ జోనల్ కార్యాలయంలో ఆదివారం స్నేహ శబరీష్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఉప కమిషనర్ రజనీకాంత్‌రెడ్డి, ఆయా విభాగాల అధికారులు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆమె ప్రజా పాలన దర ఖాస్తుల ఆన్‌లైన్ ఎంట్రీని పరిశీలించారు. నిర్ణీత వ్యవధిలో పూర్తి చేయాలని అధికారులు, సిబ్బందిని ఆదేశించారు.

ఆకట్టుకున్న ‘విద్యాంజలి కిడ్స్ కార్నివాల్’


భక్త ప్రహ్లాద నాటకం

శేరిలింగంపల్లి: చిన్నారుల వేషధారణలు, ఆటపాటలు అందరినీ ఆకట్టుకున్నాయి. శేరిలింగంపల్లి డోయన్స్ కాలనీలోని విద్యాంజలి ఉన్నత పాఠశాలలో ఆదివారం ‘కిడ్స్ కార్నివాల్’ సంబరాలు నిర్వహించారు. చిన్నారుల ఆటపాటలతో సందడి నెలకొంది. ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు, పాటలు, పొడుపు కథలు, జానపద నృత్యాలతో అలరించారు. చిన్నారుల ‘భక్త ప్రహ్లాద నాటకం విశేషంగా ఆకట్టుకుంది. ఈ వేడుకలను పాఠశాల కరస్పాండెంట్ ఎల్ నర్సింహారెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు బాలాత్రిపురసుందరి ప్రారంభించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఇంటింటికీ అయోధ్య అక్షింతలు



ఆల్విన్‌కాలనీ: అయోధ్య రామ మందిరం ట్రస్ట్ బోర్డు నుంచి వచ్చిన శ్రీరాముని అక్షింతలను పంపిణీ చేశారు. ఆదివారం శ్రీ లక్ష్మీ నరసింహ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రామచంద్రుని పల్లకిలో ఊరేగిస్తూ జై శ్రీరాం అంటూతులసినగర్ కాలనీలో ఇంటింటికీ అక్షింతలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాలనీ ప్రెసిడెంట్ జితేందర్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వెంకటరమణ, రామాచారి, రామరాజు, కుమార్‌యాదవ్, మహిళలు పాల్గొన్నారు.

రంగనాయకస్వామికి తులసి దళార్చన

మూసాపేట: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా కూకట్‌పల్లి ఐడీఎల్ చెరువు సమీపంలోని శ్రీ రంగనాయకస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం ఉదయం స్వామివారికి లక్ష తులసి దళార్చన, సాయంత్రం దీపోత్సవంను వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అదే విధంగా భరత్‌నగర్ కాలనీలోని హరిహర క్షేత్రంలో రామాలయంలో సీతారామ లక్ష్మణులకు అర్చన చేశారు. సాయంత్రం దీపోత్సవం నిర్వహించారు.

చేవెళ్లలో బీఆర్ఎస్ జెండా ఎగురవేయాలి

● ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎంపీ రంజిత్‌రెడ్డి

మియాపూర్ : జనం మెచ్చిన నాయకుడు, హ్యాట్రిక్ ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అని బీఆర్ఎస్ ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి అన్నారు.మియాపూర్ డివిజన్ పరిధిలోని నరేన్ గార్డెన్‌లో పార్టీ నాయకులు, కార్యకర్తల కృతజ్ఞత సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీ రంజిత్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రాబోయే ఎంపీ ఎన్నికల్లో చేవెళ్లలో బీఆర్ఎస్ జెండా ఎగురవేయాలన్నారు. ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడు రుణపడి ఉంటానని తెలిపారు. ప్రతి ఒక్కరం కష్టపడి బీఆర్ఎస్ పార్టీని బలోపేతం చేద్దామన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు, మాజీ కార్పొరేటర్లు, బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎల్లమ్మ ఆలయ ప్రథమ వార్షికోత్సవం

జిన్నారం (పటాన్‌చెరు): దేవాలయాల అభివృద్ధికి సహకారమందిస్తున్నామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తెలిపారు. జిన్నారం మండలం జంగంపేట గ్రామంలో గల రేణుకా ఎల్లమ్మ ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలకు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.